ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	590 (312.5050)	68,746	79,535
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.33 (3.78)	662.03	258.39
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.44 (44.84)	43,478	57,736

చికెన్ ధరలు | లైవ్ : రూ.110 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210



ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

వానాకాలంలో వేసవిని తలపించేలా ఎండలు



మోత్కూరు, సూర్యాపేటటౌన్, నల్లగొండ, ఆగస్టు 16: వానాకాలం ప్రారంభమై రెండు మాసాలు గడిచింది. అయినా ఉక్కపోత తగ్గడం లేదు. పగలు ఎండ తీవ్రత, రాత్రి ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ప్రస్తుత వానా కాలంలో ఉమ్మడి జిల్లాలో ఓ మోస్తరు వర్షాలే కురిశాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి వచ్చిన నీరంతా కృష్ణానది ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదే. కాగా, ఉమ్మడి జిల్లాలో సగానికిపైగా చెరువులు, కుంటలు నిండనేలేదు. భారీ వర్షాలు లేకపోగా, ఉక్కపోత, ఎండలకు జనం తాళలేకపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో నాగార్జునసాగర్ జలాశయం, మూసీ, పులిచింతల ప్రాజెక్టులు నిండాయి. సాగర్‌కు ఎగువ ప్రాంతాల నుంచి వరద రాగా, మూసీకి హైదరాబాద్ నగరం నుంచి వరద వచ్చి చేరడంతో అవి నిండాయి. యాదాద్రి జిల్లాలో చెరువులతోపాటు బిక్కేరు వాగులో చుక్క నీరు లేదు. జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే 21 మి.మీ తక్కువగా వర్షపాతం నమోదైంది. జూన్‌లో వర్షాకాలం ప్రారంభం కాగా, ఇప్పటి వరకు అడపాదడపా మోస్తరు వర్షాలే తప్ప భారీ వర్షాలు లేవు. దీంతో వాతావరణం చల్లబడలేదు. నడి వానాకాలంలో ఎండ తీవ్రత అధికమైంది. ఐదారు రోజులకోసారి చినుకులు పడుతున్నాయి. చినుకులకు ముందు ఉక్కపోత ఉంటోంది. వేసవి కాలంలా శరీరమంతా చెమట ప్రజలను చిరాకు కలిగిస్తోంది. ఫ్యాన్లు తిరుగుతున్నా ఉపశమనం కలగడం లేదు. రాత్రివేళల్లో సైతం ఫ్యాన్‌గాలి సరిపోవడం లేదు. మరోవైపు దోమల బెడద ఎక్కువైంది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. ఏ చిన్న ఆస్పత్రికి వెళ్లినా పదుల సంఖ్యలో జ్వరపీడితులు ఉంటున్నారు. రోజూ సుమారు 30 నుంచి 40 మంది జ్వరంతో బాధపడేవారు వస్తున్నారని మోత్కూరులోని ఓ ప్రైవేట్ డాక్టర్ తెలిపారు. జ్వరం వచ్చిన వారిలో డెంగీ లక్షణాలు లేకున్నా ప్లేట్‌లెట్లు పడిపోతుండటంతో రోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇళ్లలో ఏసీ సౌకర్యం ఉన్నవారు ఉక్కపోత భరించలేక ఏసీ వినియోగిస్తే జలుబు, జ్వరాలు వస్తున్నాయంటున్నారు. వాతావరణ సమతుల్యత లోపించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఎండల తీవ్రతకు వరి నాట్లు పుంజుకోవడం లేదు. వేసిన నాట్లు కూడా అక్కడక్కడా ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల కురిసిన ముసురుతో కొంతమేర పత్తి చేలు గట్టెక్కాయని రైతులు భావించినా, మళ్లీ వర్షాలు లేకపోవడంతో చేలు వాడు ముఖం పడుతున్నాయి. నాన్ ఆయకట్టు ప్రాంతంలో మెట్ట పంటలపై వర్షాభావం, ఎండల ప్రభావం కనిపిస్తోంది. భారీ వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో వరి సేద్యం ఇబ్బందిగా మారింది. బోర్లలో నీరు తగ్గి ఆగి ఆగిపోస్తున్నాయి. దీంతో ఐదెకరాలు నాటు పెడదామనుకున్నా రైతులు రెండెకరాలు కూడా నాట్లు వేయలేకపోయారు. ఫలితంగా నాన్ ఆయకట్టు ప్రాంతంలో వరిసేద్యం గణనీయంగా పడిపోయింది.



పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు

ఉమ్మడి జిల్లాలో నాలుగు రోజులుగా ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జూలై నెలలో పక్కకు పడేసిన కూలర్లను ప్రజలు పగలు రాత్రి తేడా లేకుండా వినియోగిస్తున్నారు. ఏసీలకు అలవాటు పడినవారు వాటిని ఆన్‌చేస్తున్నారు. పగటి ఉష్ణోగ్రత 36 నుంచి 37 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. శుక్రవారం 33 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్ర 6.30 తరువాతే కాస్త వాతావరణం చల్లబడుతోంది. రాత్రి సమయంలో ఉక్కపోతతో సరేసరి. ఏసీలు, ఫ్యాన్లు వినియోగిస్తుండటంతో మీటర్లు గిర్రున తిరుగుతున్నాయి. సూర్యాపేట జిల్లాలో 4,51,501 గృహజ్యోతి కనెక్షన్లు ఉండగా, అందులో 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్నవారు 2,10,528 మంది ఉన్నారు. అయితే ఫ్యాన్లు రోజంతా నడుస్తుండటంతో యూనిట్లు పెరిగి ఈ నెల విద్యుత్ బిల్లులు అధికంగా వచ్చే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

శీతలపానీయాలకు భలే గిరాకీ



ఎండ తీవ్రతతో శీతల పానీయాలకు భలే గిరాకీ పెరిగింది. సూర్యాపేట జిల్లా కేంద్రంలో గత వేసవి కాలంలో సుమారు 60 నుంచి 80 వరకు జ్యూస్ పాయింట్లు ఉండగా, వానా కాలం రావడంతో అందులో కొన్నింటిని తాత్కాలికంగా మూసివేశారు. ప్రస్తుతం 30 వరకు జిల్లా కేంద్రంలో జ్యూస్ పాయింట్లు నడుస్తున్నాయి. నాలుగైదు రోజులుగా ఉక్కపోత, వేడి పెరగడంతో ప్రజలు జ్యూస్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో గతంలో కంటే ధర పెంచి వ్యాపారులు శీతలపానీయాలను విక్రయిస్తున్నారు. అంతేగాక సీజనల్ వ్యాధుల బారిన పడుతుండడంతో ప్రజలు శీతలపానీయాలను ఆశ్రయిస్తున్నారు. గతంలో కొబ్బరి బొండం రూ.30 ఉండగా, ప్రస్తుతం రూ.50 వరకు విక్రయిస్తున్నారు. అంతేగాక లీటర్ కొబ్బరి నీళ్లకు గతంలో రూ.150 నుంచి రూ.160 వరకు ధర ఉండగా, ప్రస్తుతం లీటర్ కొబ్బరి నీళ్ల రూ.200కు విక్రయిస్తున్నారు. అదేవిధంగా మార్కెట్‌లో పుచ్చకాయల విక్రయాలు పెరిగాయి. వీటి ధరను వ్యాపారులు పెంచి విక్రయిస్తున్నారు. మరి కొద్దిరోజులు ఇలాగే వాతావరణం ఉంటే ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. అయితే వాతావరణంలో మార్పులు సహజమని, త్వరలో వాతావరణం చల్లబడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

ఖిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

త్వరలో ప్రతిపాదిత పనులు ప్రారంభం ● స్వదేశీ దర్శన్ డైరెక్టర్ రోషన్ థామస్



భువనగిరి ఖిల్లాను పరిశీలిస్తున్న స్వదేశీ దర్శన్ డైరెక్టర్ రోషన్ థామస్ బృందం

భువనగిరి టౌన్, ఆగస్టు 16: చారిత్రక కట్టడాలతో అత్యంత ఎత్తయిన ఏకశిలా పర్వతంగా ఉన్న భువనగిరి ఖిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని స్వదేశీ దర్శన్ డైరెక్టర్ రోషన్ థామస్ అన్నారు. శుక్రవారం స్వదేశీ దర్శన్ బృందం, రాష్ట్ర టూరిజంశాఖ అధికారులు, ఎల్అండ్‌టీ ఇంజనీరింగ్ బృందంతో కలిసి ఖిల్లాను సందర్శించారు. అనంతరం ఖిల్లా అభివృద్ధి పనులపై హైదరాబాద్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందేందుకు భువనగిరి ఖిల్లాకు పుష్కల అవకాశాలు ఉన్నాయన్నారు. స్వదేశీ దర్శన్ పథకానికి భువనగిరి ఖిల్లా ఎంపిక సరైన నిర్ణయమన్నారు. ఇప్పటికే పర్వతారోహణ శిక్షణలో పేరుగాంచిన భువనగిరి ఖిల్లా సాహస క్రీడలకు అనువుగా ఉందన్నారు. స్వదేశీ దర్శన్ పథకంలో చేపట్టనున్న అభివృద్ధి పనుల డీపీఆర్‌ను మరింత విస్తృతం చేయాలన్నారు. మొదటి దఫాలో చేపట్టనున్న రోప్‌వే తదితర పనులకు వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి పనులను డీపీఆర్‌లో ప్రతిపాదించాలని, లైట్ అండ్ సౌండ్ సిస్టమ్, లేజర్‌షో తదితర పనులను డీపీఆర్‌లో ప్రతిపాదించాలన్నారు. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదని, డీపీఆర్ ఆధారంగా నిధులు మంజూరు చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. రాక్ క్లైంబింగ్ స్కూల్‌ను పరిశీలించి పర్వతారోహకులతో మాట్లాడారు. ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం యాదగిరిగుట్ట దేవస్థానం సమీపంలో ఉండటంతో ప్రతిపాదిత పనులు పూర్తయితే ఖిల్లాకు పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. ఖిల్లాకు ప్రాచుర్యం కల్పించడంలో స్థానికులను భాగస్వాములను చేయాలని సూచించారు. స్వదేశీ దర్శన్ పనులు పూర్తయ్యే వరకు నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. ఆయన వెంట పర్యాటక శాఖ భువనగిరి ఖిల్లా లైజన్ ఆఫీసర్ వైఆర్‌కె.రాజు, తదితరులు ఉన్నారు.

నూతన పారిశ్రామిక వాడలపై ప్రభుత్వం నజర్

రహదారులకు 100కి.మీ లోపు భూముల సేకరణ ● 1,000ఎకరాల్లోపు ఏర్పాటుకు సన్నాహాలు



గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను విస్తరించేనా?

హైదరాబాద్ నగరానికి చేరువలో నూతనంగా పారిశ్రామిక వాడల ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఔటర్‌రింగ్‌రోడ్డు వెలుపల, రీజినల్ రింగ్‌రోడ్డు లోపల ఈ వాడలను నెలకొల్పేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తోంది. రాష్ట్ర రాజధానికి అతిచేరువలో ఉన్న జిల్లాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు అధిక అవకాశాలు ఉన్నాయి.

● ఆంధ్రజ్యోతి, యాదాద్రి

జిల్లాలో ఇప్పటికే చౌటుప్పల్, భువనగిరి, బీబీనగర్ మండలాల పరిధిలో పారిశ్రామిక వాడలు ఉన్నాయి. దండుమల్కాపూర్‌లో ఆసియాలోనే పెద్ద గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను నెలకొల్పారు. ప్రభుత్వం నూతనంగా నెలకొల్పనున్న పారిశ్రామిక వాడలను 500ఎకరాల నుంచి 1,000ఎకరాల్లో ఏర్పాటు చేసేందుకు భూములను గుర్తించాలని ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. విమానాశ్రయాలు, జాతీయ, రాష్ట్ర రహదారులకు 50 నుంచి 100కిలోమీటర్ల దూరంలోనే భూములు సేకరించాలని సూచించారు. ప్రభుత్వ ఆలోచన ప్రకారం నూతనంగా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు జిల్లా అనుకూలంగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

జిల్లాకు ఔటర్‌రింగురోడ్డు కేవలం 25 నుంచి 30కిలోమీటర్ల దూరంలో ఉంది. అదేవిధంగా ఆర్ఆర్ఆర్ జిల్లాలోని భువనగిరి, యాదగిరిగుట్ట, తుర్కపల్లి, వలిగొండ, చౌటుప్పల్ మండలాల నుంచి వెళ్లనుంది. ఆర్ఆర్ఆర్‌కు సంబంధించిన భూముల సర్వే పనులతోపాటు రోడ్డు సరిహద్దులను పూర్తి చేసి, పెగ్‌మార్కులు కూడా ఏర్పాటుచేశారు. కేంద్ర ప్రభుత్వం భారత్‌మాల యోజన పథకంలో ఈ రోడ్డును మంజూరు చేస్తున్నట్టు ప్రకటించింది. ఇప్పటికే భూసేకరణపై కేంద్రం 3డీని విడుదల చేసింది. ఈ రహదారికి జిల్లా పరిధిలో 34 గ్రామాల్లో 1852.44ఎకరాల భూమి సేకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విధానానికి అనుకూలంగా ఉండటంతో నూతనంగా పరిశ్రమలు నెలకొల్పే అవకాశం ఉందని స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

జిల్లాలోని పలు పారిశ్రామిక వాడల్లో ఇప్పటివరకు 1,090 పరిశ్రమలకు అనుమతులు మంజూరు కాగా, 536 పరిశ్రమల్లో ఉత్పత్తులు ప్రారంభమయ్యాయి. మిగతావి కూడా త్వరలోనే ప్రారంభం కానున్నాయి. దండుమల్కాపూర్‌లో అతిపెద్ద గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను 547ఎకరాల్లో అభివృద్ధి చేశారు. పలు పరిశ్రమలను స్థాపించేందుకు ఇక్కడ స్థలాలను కేటాయించారు. 2019లో ఈ పార్క్‌ను ఏర్పాటుచేయగా, ఈ పారిశ్రామిక వాడతో 35వేల మందికి ఉపాధి కల్పించడం లక్ష్యం. ఈ ప్రాంతంలోనే యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించి, స్థానికులకు వివిధ కోర్సుల్లో శిక్షణను ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ పార్క్‌ను విస్తరించాలని గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ప్రభుత్వం విస్తరించేందుకు చర్యలు తీసుకుంటుందా? లేదా? అనేది చర్చనీయాంశంగా మార్పింది. భువనగిరి, మునుగోడు, ఆలేరు నియోజకవర్గాలు హైదరాబాద్‌కు అతి చేరువలో ఉండటంతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయం, జాతీయ, రాష్ట్ర రహదారులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాలో నూతనంగా పరిశ్రమలు స్థాపించే యోచనలో ఉన్నట్టు సమాచారం.

జిల్లా అనుకూలం

నూతనంగా పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేసేందుకు జిల్లా అనుకూలంగా ఉంది. కనీసం 500నుంచి 1,000 ఎకరాల భూమి సేకరించాలంటే పెద్ద మొత్తంలో పరిహారం చెల్లించాలి. రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ జిల్లాల్లో ఇప్పటికే సేకరించిన భూముల్లో నూతంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి, పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేసే వాడలను నగరానికి దూరంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. విలువైన భూములకు పరిహారం ప్రభుత్వం ఆ మేరకు ఇవ్వడం కూడా కష్టతరం. ఈ నేపథ్యంలో నగరానికి 100కిలోమీటర్ల దూరంలో భూములు తక్కువ ధరకు లభించాలంటే జిల్లానే అనుకూలంగా ఉంటుందని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

కలెక్టర్ హనుమంతు కే.జెండగే



నర్సాపూర్ గ్రామంలో నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

రాజాపేట, ఆగస్టు 16: వర్షాకాలం అయినందున పారిశుధ్య పనులను నిరంతరం చేపట్టాలని, ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నర్సాపూర్ గ్రామంలో నర్సరీని, డ్రైడే పనులను, అమృత్ సరోవర్ ప్రాజెక్టు కింద చేపట్టిన చెరువు పూడికతీత పనులను తనిఖీచేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్‌లో ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో తిరిగి మొక్కలు నాటాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో నాగవేణి, ఎంపీవో కిషన్, పంచాయతీ కార్యదర్శి పవన్ ఉన్నారు.

నేడు సర్దార్ పాపన్న జయంతి

భువనగిరి అర్బన్: సర్దార్ పాపన్నగౌడ్ 374వ జయంతి వేడుకలు కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ హనుమంతు కే.జెండగే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటలకు ప్రారంభించే ఈ వేడుకల్లో బీసీ కుల సంఘ నాయకులు, ప్రజలు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

● భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



శ్రావణమాసం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మహిళలు శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజలను ఆచరించారు. దీంతో ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ●8లో..

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళలకు కట్టుమిషన్ శిక్షణ సర్టిఫికెట్లు అందజేస్తున్న బీర్ల అయిలయ్య, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

ఆలేరు రూరల్, ఆగస్టు 16: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆలేరులో మదర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మహిళలను మహరాణులుగా మార్చాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతోపాటు, నెలకు రూ.2500 ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. అనంతరం మహిళలకు కుట్టు మిషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, పీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గంధమల్ల అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, ఉన్నారు.

రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా చేయాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యతో పాటు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణికి ఆలేరు రెవెన్యూ డివిజన్ అఖిలపక్ష పోరాట కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా ఆలేరులో దక్షిణ్ ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్, పద్మావతి రైళ్లను నిలపాలని కోరారు. కార్యక్రమంలో పసుపునూరి వీరేశం, జనార్ధన్, సలీం, వెంకటేష్, శేఖర్, అశోక్, రవి, సత్యం, ఉప్పలయ్య, మల్లేశం, తదితరులు ఉన్నారు.

లంబాడ భాషను ఎనిమిదో షెడ్యూల్లో చేర్చాలి

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్ నాయక్

భువనగిరి టౌన్, ఆగస్టు 16: లంబాడ భాష బోర్ బోలిని రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్లో చేర్చాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మూడవత్ రాంబాల్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగంలో చేర్చడం ద్వారా లంబాడ భాష అభివృద్ధికి అవకాశాలు పెరుగుతాయన్నారు. గిరిజన ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలన్నారు. ఎల్‌హెచ్‌పీఎస్ ఏ రాజకీయ పార్టీకి అనుకూలం, వ్యతిరేకం కాదని, కేవలం లంబాడాల ప్రయోజనాలను కాపాడేందుకు మాత్రమే పోరాడుతుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బానోతు భాస్కర్‌నాయక్, విశ్రాంత ఆర్డీవో బానోత్ శంకర్‌నాయక్, విశ్రాంత తహసీల్దార్ సోమ్లా నాయక్, మహేందర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆరుట్ల దంపతుల స్ఫూర్తితో ఉద్యమించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ఆలేరు రూరల్, ఆగస్టు 16: ఆరుట్ల దంపతుల స్ఫూర్తితో కార్యకర్తలు ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆలేరులో నిర్వహించిన పార్టీ జిల్లా స్థాయి కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని, కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. దేశంలో మతోన్మాదం, మనువాదం పెరుగుతోందని, దానికి వ్యతిరేకంగా పార్టీ పోరాడుతోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా, రైతు, కార్మిక కర్షక, విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పట్టా వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, నాయకులు చెక్క వెంకటేశ్, బొలగాని సత్యనారాయణ, దామోదర్‌రెడ్డి రాజయ్య, అశోక్, జంగమ్మ, కృష్ణ, ఇమ్రాన్, రాజమణి, రాములు, మహేందర్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మద్దెలమ్మ బోనాల ఉత్సవాలు ప్రారంభం

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 16: చౌటుప్పల్ పట్టణంలోని మణికంఠనగర్ కాలనీలో నాలుగు రోజుల పాటు నిర్వహించే బోనాల ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సుప్రభాతం, గణపతి పూజ, స్వస్తి వాచనం, అఖండ దీపారాధన, మండపారాధన, నూతన పంచముఖ హనుమాన్ విగ్రహ జలాధివాసం, ధాన్య, పుష్పాధివాసం, హోమం, మంగళహారతి, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం పంచముఖ హనుమాన్ విగ్రహంతో పాటు నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠను నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ అధ్యక్షుడు గోశిక స్వామి, ప్రధాన కార్యదర్శి గోశిక రవి తెలిపారు. కార్యక్రమాల్లో దేవాలయ కమిటీ ప్రతినిధులు గుర్రం నర్సింహ, గంజి రామచంద్రం, జల్లా నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

భువనగిరి రూరల్, ఆగస్టు 16: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన అందుతోందని, ప్రతీ ఒక్కరు పాఠశాలల బలోపేతానికి తోడ్పాటు ఇవ్వాలని సామాజికవేత్త డాక్టర్ కస్తూరి లక్ష్మీనారాయణ అన్నారు. భువనగిరి మండలం వీరవెల్లి జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేద విద్యార్థులు చదువుతున్న పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కంచి లలిత, కంచి మల్లయ్య, ప్రధానోపాధ్యాయురాలు శ్యామసుందరి, తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిక్షేత్రంలో పవిత్రోత్సవాలు పరిసమాప్తి

● నేటి నుంచి ఆర్జిత సేవలు ప్రారంభం

భువనగిరి అర్బన్, ఆగస్టు 16: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో, పాతగుట్ట ఆలయంలో మూడు రోజులుగా కొనసాగిన పవిత్రోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. శుక్రవారం ఉదయం ప్రధానాలయంలో నిత్య కైంకర్యాల అనంతరం ఉత్సవమూర్తులను నవకలశాలతో స్నపన తిరుమంజనాలు చేసి ఆభరణాలతో అలంకరించి, ప్రత్యేకసేవలో తీర్చిదిద్దారు. ఆలయ అష్టభుజి ప్రాకార మండపంలోని యాగశాల వద్దకు ఊరేగింపుగా తరలించి, హోమాది పూజలు చేపట్టారు. మహాపూర్ణాహుతి నిర్వహించారు. మహాకుంభకలశాన్ని పవిత్రీకరించిన 108నూలుపోగులతో తయారుచేసిన మాలలను అంతరాలయంలో మూలమూర్తులు, సువర్ణ ప్రతిష్ఠమూర్తులను అలంకరించారు. అనంతరం దివ్య విమాన గోపురంపై సుదర్శన చక్రానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకబృందం పవిత్రమాలలు అలంకరించింది. వేద మంత్రాలతో పవిత్రీకరించిన సప్తవర్ణాలలో 108నూలు, పట్టుపోగులతో తయారు చేసిన పవిత్రమాలలను స్వామిఅమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు వేద మంత్రోచ్చరణలతో అలంకరించడంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు నల్లంథీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, అధికారులు పాల్గొన్నారు. నేటి నుంచి అర్జిత సేవలను పునఃప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు లక్ష్మీనరసింహాచార్యులు, అర్చకబృందం

వైభవంగా ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవ

యాదగిరిగుట్ట కొండపై శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా జరిపారు. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి ఊంజల్ సేవలో తీర్చిదిద్దారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధవిభాగాల నుంచి రూ.23,07,813 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కాగా మరో రూ.10లక్షలు లీజులకు సంబంధించి ఆదాయం సమకూరిందని తెలిపారు.

ఉపాధి వేతనాలు వచ్చాయ్

● జూలై వరకు రూ.32.35 కోట్ల చెల్లింపు



మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 16: ఉపాధిహామీ పథకం కింద పనులకు హాజరైన కూలీలకు చెందిన పెండింగ్ వేతనాలు వచ్చాయి. మే నుంచి జూలై నెల వరకు వేతనాల చెల్లింపు ప్రక్రియ పలు కారణాలతో స్తంభించింది. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' జిల్లా ఎడిషన్‌లో ఈ నెల 9వ తేదీన 'పది వారాలుగా .. పైసా ఇవ్వలే' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. సమస్యను ఉన్నతాధికారులు, ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ స్పందించి పెండింగ్ బిల్లులను విడుదల చేసింది. దీంతో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు ఉన్న పెండింగ్ వేతనాలు చెల్లించారు. మే నుంచి జూలై నెలాఖరు వరకు రూ.32కోట్ల నిధులను విడుదల చేయగా, నల్లగొండ జిల్లాలోని కూలీలకు రూ. 14.55 కోట్లు, సూర్యాపేట జిల్లాలో 11.32 కోట్లు, యాదాద్రిభువనగిరి జిల్లాలో రూ. 6.47కోట్ల పెండింగ్ వేతనాల చెల్లింపు ప్రక్రియ శుక్రవారం నాటికి పూర్తయింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ఉపాధిహామీ పథకం పనులకు వెళ్లిన కూలీల బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమయ్యాయి. ఉపాధి వేతనాలు తమ ఖాతాలో జమకావడంతో కూలీలకు కొంతమేర ఆర్థికపరమైన ఊరట దక్కింది. మిగతా నిధులు సైతం త్వరలోనే చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు తెలిపారు.

మొత్తం వేతనాలు చెల్లిస్తాం

ఉపాధిహామీ పథకానికి ఈ ఏడాది విశేష ఆదరణ లభించింది. దీంతో వార్షిక బడ్జెట్‌లో 90 శాతం వరకు పనిదినాలు పూర్తయ్యాయి. పనులకు హాజరైన కూలీలకు పూర్తిస్థాయిలో వేతనాలు చెల్లించేందుకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ వారం ఈ- మస్టర్‌రోల్‌లో నమోదైన హాజరు పట్టిక వివరాలను ఎన్ఐసీ ద్వారా సీఆర్‌డీకి అప్‌లోడ్ చేశాం. త్వరలోనే పూర్తిస్థాయిలో వేతనాల చెల్లింపు ప్రక్రియ ముగుస్తుంది. కూలీలు ఎలాంటి అపోహలకు లోనవద్దు.

-శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీవో, నల్లగొండ

రాఖీ పంపాలా... ఆర్టీసీ కార్గో సర్వీసు ఉందిగా..

నల్లగొండ, మిర్యాలగూడటౌన్, ఆగస్టు 16: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఆర్టీసీ కార్గో ద్వారా రాఖీలను అందజేయనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజశేఖర్, ఆర్టీసీ డిపో సేల్స్ ఎగ్జిక్యూటివ్ పీఎస్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనురాగాన్ని ఆప్యాయతలను పంచుకొనేందుకు, సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పుకునేందుకు రాఖీలను పంపించడానికి ఆసక్తి ఉన్న వారు కార్గో బుకింగ్ చేసుకోవాలని తెలిపారు. కార్గో బుకింగ్‌ల కోసం సెల్ నెంబర్లు 9154298690, 9154298693, 9154298694, 9154298695లను సంప్రదించి సంస్థ ఆదాయం పెరిగేందుకు సహకరించాలని కోరారు. నల్లగొండ రీజనల్ పరిధిలోని వివిధ గ్రామాలు, మండలాలు, పట్టణాలకు చెందిన సోదరులు, సోదరీమణులు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దూర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న సోదరులు, సోదరీమణులు రాలేకపోతున్న వారికి రాఖీలతో పాటు స్వీట్ బాక్సులు, బహుమతులు, ఇతర సామగ్రిని వారి నివాసాలకు పంపేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఈ మేరకు ఆయా బస్‌స్టేషన్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎర్రకోటలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

● అభినందించిన బండి సంజయ్



ఢిల్లీలో స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న తెలంగాణ ఎన్ఎస్ఎస్ వాలింటీర్లు, ఆఫీసర్ కోటయ్య

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 16: దేశ రాజధానిలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్రానికి చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. కేంద్రప్రభుత్వం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వలంటీర్లుగా రాష్ట్రంలోని నాలుగు విశ్వవిద్యాలయాల్లో సేవలందిస్తున్న విద్యార్థులను తొలిసారిగా స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అవకాశం కల్పించింది ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు యూనివర్సిటీల్లో సేవలందిస్తూ సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించిన 16 మంది వలంటీర్లను ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఎంపిక చేశారు. వారితో పాటు ఎంజీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా సేవలందిస్తున్న నర్సింగ్ కోటయ్యను కంటింజెంట్ లీడర్‌గా ఎంపికయ్యారు. 16 మందితో కూడిన బృందంతో ఈ నెల 13న ఢిల్లీ వెళ్లి ఉత్సవాల్లో పాల్గొని శుక్రవారం రాష్ట్రానికి చేరుకుంది.

● స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ బృందాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అభినందించారు. ఢిల్లీలోని తన నివాసానికి ఆహ్వానించి ఆతిథ్యమిచ్చినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నర్సింగ్ కోటయ్య తెలిపారు. కేంద్రమంత్రి మనుసుక్ మాండవ్య కంటింజెంట్ లీడర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ప్రత్యేకంగా అభినందించి వలంటీర్లలో ఉత్సాహం నింపినట్లు కోటయ్య తెలిపారు.

● కృష్ణమ్మ రాకతో..

ఆయకట్టుకు ఊపిరి

● సాగు పనుల్లో బిజీగా రైతులు ● పెరిగిన భూగర్భ జలాలు
● వ్యవసాయ అనుబంధ రంగాలకు ఊతం



నీరు పారుతున్న ఎడమ ప్రధాన కాల్వ

మిర్యాలగూడ (వ్యవసాయం), ఆగస్టు 16: దశాబ్ద కాలంగా పచ్చని పంటలతో ధాన్యాగారంగా మారిన సాగర్ ఆయకట్టు ఒక్క ఏడాది వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో ఎడారిగా మారింది. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. చుక్క నీటికోసం వెంపర్లాడాల్సిన దుస్థితి. అన్నదాతలు ఆర్థికంగా చితికిపోయారు. ఈ ఏడాది జూన్ నుంచే జల్లులు మినహా భారీవర్షాలు పడలేదు. దీంతో పంటల సాగుపై రైతులు ఆశ వదులుకొని నైరాశ్యంలో మునిగిపోయారు. కృష్ణా నదికి పైభాగంలో భారీ వర్షాలు పడటంతో వారం రోజుల వ్యవధిలో ఆయకట్టుకు నీటి విడుదల జరిగింది. కృష్ణమ్మ పరవళ్లతో నేల పులకరించింది. అన్నదాతలకు ఊపిరిపోసింది. పంటల సాగుకు ఆయకట్టు సమాయత్తం అవుతుంది.



కాల్వ ఆధారంగా పోసుకున్న నారు

వరి సాగు షురూ..

నాగార్జునసాగర్ ఎడమకాల్వ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా లో 6.50లక్షల ఆయకట్టు ఉంది. సాగర్ నిండటంతో ఈ ఏడాది రెండు సీజన్లకు అవసరమయ్యే సాగునీరు ఉండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. రైతులు వరి సాగు పొలాలు దుక్కులు దున్ని, నారు మడులు పోసుకుని వరి నాట్లకు సిద్ధమవుతున్నారు. గతేడాది సాగర్ నీటి విడుదల లేకపోయినా బోరుబావుల ఆధారంగా సుమారు లక్షన్నర ఎకరాల్లో వరి సాగు చేశారు. కాల్వ నీటితో సాగు జరిగే భూములు పడావుగా మారాయి. ఏడాది పాటు పొలాలు బా గా ఆరిపోయి ఉండటంతో ఈ సారి పంటలు బాగా పండుతాయని వ్యవసాయ నిపుణులు, రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

స్థానికంగా వర్షాలు లేకపోయినా....

గత ఏడాది నుంచి సరైన వర్షాలు లేకపోవడంతో ఆయకట్టులో భూగర్భజలాలు వంద అడుగులపైగా కిందికి వెళ్లిపోయాయి. ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 91.3 మి.మీ కాగా 166 మి.మీ వర్షం కురిసింది. దీంతో 81.7 అధికంగా నమోదైనట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటి వరకు సరైన వర్షా లు పడలేదు. ఆయకట్టులో పెద్దవూర, అనుముల, నిడమనూరు, మిర్యాలగూడ ప్రాంతాల్లో అధికారులు చెబుతున్న గణాంకాల్లో సగం వర్షపాతం నమోదు కాకపోవడం విచారకరం. ఇప్పటివరకు ఏ చెరువు, కుంటలు, బావుల్లో చుక్కనీరు రాలేదని రైతులు వాపోతున్నారు. రైతులు వందలాది బోర్లు వేసి లక్షలాది రూపాయలు నష్టపోయి అప్పులపాలయ్యారు. కృష్ణాజలాల రాకతో ఆయకట్టు దృశ్యం మారిపోయింది. నెల రోజుల వ్యవధిలో చెరువులు బోరు బావుల్లో నీరు సమృద్ధిగా పెరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ఆయకట్టులో నాటు వేసేందుకు పొలం దున్నుతున్న రైతు

వ్యవసాయ పనులతో సందడి

ఆయకట్టు ప్రాంతాల్లో పంటల సాగుకు అనుబంధంగా ఎన్నో రంగాలు వెలిశాయి. దశాబ్దకాలంగా ఈ ప్రాంతంలో వందల సంఖ్యలో ఎరువులు, విత్తన దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఒక్కో మండల కేంద్రంలో సుమారు 20-30 వరకు దకాణాలు ఉన్నాయి. గత ఏడాది నీటి విడుదల లేకపోవడంతో వ్యాపారాలు నడవక దుకాణదారులు ఆర్థికంగా దెబ్బతిన్నారు. ప్రస్తుతం విత్తనాలు కొనుగోలుతో పాటు ఎరువులు, పురుగు మందులను రైతులు కొనుగోలు చేస్తుండటంతో దుకాణాల వద్ద సందడి నెలకొంది. వ్యవసాయ యంత్రాలు, పరికరాలు తయారు చేసే వెల్డింగ్ దుకాణాలతో పాటు, ట్రాక్టర్ మరమ్మతులు చేసే షెడ్లు, పరికరాలు విక్రయించే ఆటోమొబైల్ దుకాణాలు, కమ్మరి కొలిమిలకు కృష్ణమ్మ ఊపిరిపోసింది. ప్రస్తుతం ఆయకట్టులో వ్యవసాయ పనులతో సందడిగా మారింది.

పరికరాల పనిలో నిమగ్నమయ్యాం



ఏడాది నుంచి చేతిలో పని లేక చాలా ఇబ్బందులు పడ్డాం. సాగర్ కాల్వలకు నీటి విడుదల జరగడంతో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. ట్రాక్టర్లకు ఉపయోగించే నాగళ్లు, వీల్స్ తయారీ పనుల్లో నిమగ్నమయ్యాం. ప్రస్తుతం ఆశాజనకంగా ఉంది.

- చరణ్, వెల్డింగ్ షాపు నిర్వాహకుడు, మిర్యాలగూడ

సాగర్ నీళ్లొస్తేనే ఉపాధి



సాగర్ నిండితేనే చేతి నిండా పనులు ఉంటా యి. ఈ ఏడాది ఆయకట్టుకు నీటి విడుదల చేయడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ట్రాక్టర్ల వినియోగం పెరిగింది. మరమ్మతుల పనుల్లో బిజీగా ఉన్నాం. పంటల నీటికి ధోకా లేకపోవడంతో ఉపాధికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

- శ్రీలోజు జానకిరాములు, ట్రాక్టర్, మెకానిక్


నీటి విడుదలతో పంటల సాగు



గత ఏడాది వర్షాలు లేక బోర్లు వేసి లక్షల రూపాయలు నష్టం పోయాం. ఈ ఏడాది సాగర్ నిండి నీటి విడుదల చేయడంతో వరి సాగుకు సిద్ధమవుతున్నాం. స్థానికంగా వర్షాలు పడకపోయినా కాల్వ నీటితో భూగర్భజలాలు పెరుగుతాయి.

- సయ్యద్, రైతు, త్రిపురారం

సాగర్ 4 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల



నాగార్జునసాగర్ 4 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, ఆగస్టు 16: నాగార్జునసాగర్ ప్రాజెక్టు 4 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తి 32,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి పూర్తిస్థాయిలో ఉంది. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు (215.8070టీఎంసీలు) కాగా శ్రీశైలానికి ఎగువ నుంచి 1,06,419 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో శుక్రవారం సాయంత్రానికి 881.40 అడుగులుగా (195.6605టీఎంసీలు) ఉంది. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు 68,746 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 8,067 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 7,518 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,150 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, 4 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తి 32,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 79,535 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువనుంచి 68,746 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతుంది.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువ నుంచి వరద శుక్రవారం సాయంత్రానికి 662.03 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645(4.46టీఎంసీల) అడుగులు కాగా ప్రస్తుతం 642.33(3.78టీఎంసీల) అడుగులుగా ఉంది. ప్రాజెక్టు ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం కుడి, ఎడమ కాల్వలకు 258.39 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

పులిచింతలలో...

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యానికి చేరువలో ఉంది. గరిష్ఠ నీటిమట్టం 175అడుగులు(45.77టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 174.44అడుగులకు(44.84 టీఎంసీల) చేరింది. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 43,478 క్యూసెక్కులు కాగా రెండు రేడియల్ క్రస్ట్ గేట్లను 2.5 మీటర్లు ఎత్తి 41,736 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తెలంగాణ జెన్‌కో విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ, నాలుగు యూనిట్ల ద్వారా 100 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. మొత్తం ప్రాజెక్టు అవుట్‌ఫ్లో 57,736 క్యూసెక్కులుగా ఉంది.



నిండుకుండలా పులిచింతల ప్రాజెక్టు

నేడు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ సేవల నిలిపివేత



నల్లగొండ జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

నల్లగొండ, మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 16: కోల్‌కతాలో ఈ నెల 9వ తేదీన పోస్టు గ్రాడ్యుయేట్ డాక్టర్‌పై జరిగిన పాశవిక హత్య ఘటనకు నిరసనగా శనివారం అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో అన్ని సేవలు నిలిపివేయనున్నట్లు ఐఎంఏ అధ్యక్షురాలు జి.అనితరాణి, ప్రధాన కార్యదర్శి ఆర్.రమేష్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆనంద్‌డాంగ్రే, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎల్.రమేష్ మిర్యాలగూడ ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జీవన జ్యోతి, డాక్టర్ సరిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేదీన ఉదయం 6 నుంచి 18వ తేదీన ఉదయం 6 గంటల వరకు దేశవ్యాప్తంగా ఓపీ సేవలు నిలిపివేయడానికి నేషనల్ ఐఎంఏ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో నల్లగొండ అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఇది ఒక వైద్యురాలిపై జరిగిన దాడి లాగానే కాకుండా ఓ స్త్రీమూర్తిపై జరిగిన దాడిగా మానవత్వంపై జరిగిన అమానుష దాడిగా భావిస్తున్నామన్నారు. కాగా నల్లగొండ జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాలకు చెందిన జూనియర్ డాక్టర్లు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. కళాశాల నుంచి ర్యాలీని పలు కూడళ్లలో నిర్వహించి హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోను కలిసిన ఐఎంఏ బృందం

జిల్లాలో ఇటీవల నూతనంగా డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన పుట్ట శ్రీనివాస్‌ను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నీలగిరి బ్యాంకు తరపున డాక్టర్లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డాక్టర్లు అనితారాణి, పుల్లారావు, రమేష్, ప్రవీణ్, రాజేశ్వరి, అరుంధతి, వసంతకుమారి, సుచరిత, గౌరీశ్రీ, చంద్రమౌళి, రాంమనోహర్, ఈశ్వర్, వినయ్, వేణుగోపాల్‌రెడ్డి, కల్యాణచక్రవర్తి, రవి, శ్రీకాంత్ వర్మ, శశిధర్ ఉన్నారు.

యూరియా కోసం అన్నదాతల పరుగులు



యూరియా తీసుకువెళ్లేందుకు తెచ్చిన ఆటోలు

నిడమనూరు, ఆగస్టు 16: యూరియా కోసం అన్నదాతలు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిడమనూరు మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం ఎదుట శుక్రవారం యూరియా టోకెన్ల కోసం రైతులు ఎగబడ్డారు. వానాకాలం సీజన్‌లో మండలంలో వరి సాగు గణనీయంగా పెరగడంతో రైతుల అవసరాల మేరకు మార్కెట్‌లో యూరియా దొరకడం లేదు. ఎరువుల దుకాణాల్లోనూ యూరియా లభించడం లేదంటున్నారు. స్టాకు లేదని చెబుతూనే కొందరు దుకాణదారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. పీఏసీఎస్ సొసైటీ ద్వారా 45 కిలోల బస్తాను రూ.266కు విక్రయిస్తున్నారు. దీంతో రైతులు సొసైటీల వద్ద ట్రాక్టర్లు, ఆటోలతో నిరీక్షిస్తున్నారు. యూరియా నిల్వలు అవసరమైన మేరకు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందొద్దని నిడమనూరు సొసైటీ బుచ్చాల జానయ్య తెలిపారు. అందరికీ యూరియా అందిస్తామని పేర్కొన్నారు.

భార్య హత్య కేసులో అరెస్టు

అనుమానంతోనే ఘాతుకం



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్

సూర్యాపేట క్రైం, ఆగస్టు 16: కులాంతర వివాహం చేసుకున్న భార్యను చంపిన భర్తను పోలీసులు అరెస్టు చేశారు. సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. చిలుకూరు మండల కేంద్రానికి చెందిన దాసోజు బ్రహ్మచారి 2014లో నకిరేకల్ మండలం కడపర్తి గ్రామానికి చెందిన సరితను కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. డోర్ల పాలిష్ పనులు చేసే బ్రహ్మచారి మద్యానికి అలవాటుపడ్డాడు. ఈవిషయంలో దంపతుల మధ్య గొడవలు జరిగాయి. దీంతో ఇద్దరు పిల్లలను సరిత కుటుంబ సభ్యులు తీసుకువెళ్లి పోషిస్తున్నారు. మూడేళ్ల కుమారుడు బ్రహ్మచారి-సరిత వద్ద ఉంటున్నాడు. సూర్యా పేటలోని శ్రీరాంనగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని బ్రహ్మచారి దంపతులు నివసిస్తున్నారు. బ్రహ్మచారి డోర్ పాలిష్ పనులకు వెళుతుండగా, సరిత ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. కాగా, భార్య సరితపై భర్త బ్రహ్మచారికి అనుమానం మొదలైంది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 14న ఉదయం కూడా ఇద్దరి మధ్య గొడవ జరగడంతో ఆగ్రహంతో బ్రహ్మచారి ఇంట్లో ఉన్న జీఐ వైరును సరిత మెడకు బిగించి హత్య చేశాడు. అనంతరం సరిత కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి కుటుంబ సభ్యుల సహకారంతో అంబులెన్స్‌లో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సరితను పరీక్షించిన వైద్యులు ఆస్పత్రికి తీసుకరాక ముందే మృతి చెందిందని తెలిపారు. దీంతో వెంటనే బ్రహ్మచారి అక్కడినుంచి పరారయ్యాడు. సరిత తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు బ్రహ్మచారికి చిలుకూరులో అరెస్టు చేయగా, భార్యను హత్య చేసినట్లు అంగీకరించాడు. బ్రహ్మచారిని సూర్యాపేట కోర్టులో హాజరుపరుస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. విలేకరుల సమావేశంలో పట్టణ ఎస్ఐ ఎం.లింగయ్య, ఏఎస్ఐ మేకపోతుల శంకర్, అభిషేక్ ఉన్నారు.

వరలక్ష్మీ కరుణించుమా..



భువనగిరి కన్యకాపరమేశ్వరి ఆలయంలో వరలక్ష్మీ వ్రత పూజలు

భువనగిరి టౌన్, ఆగస్టు 16: వరలక్ష్మీ వ్రత పూజలను శుక్రవారం భువనగిరిలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని కన్యకాపరమేశ్వరి మురళీకృష్ణ, సంతోషిమాత, గోవింద క్షేత్రం, నల్లపోచమ్మ, భువనేశ్వరిమాత ఆలయాల్లో సామూహిక వ్రత పూజలు నిర్వహించారు. ఎలువురు మహిళలు ఇళ్లలో సంప్రదాయ రీతిలో వ్రత పూజలు జరుపుకున్నారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. వరలక్ష్మీ వ్రత విశిష్టతను వేద పండితులు వివరించారు. కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించి భక్తిని చాటుకున్నారు. భజనలు చేసి భక్తి గీతాలు అలపించారు. మహిళా భక్తులు ఉపవాస దీక్షలు చేయగా పలు ఆలయాల్లో అన్నప్రసాద వితరణ జరిపారు.

చౌటుప్పల్ టౌన్ : స్థానిక సీతారామచంద్రస్వామి దేవాలయంలో శ్రావణ రెండవ శుక్రవారం సందర్భంగా మహిళా భక్తులు సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. మహిళా భక్తులకు మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు దంపతులు వాయినాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ కమిటీ మండల అధ్యక్షురాలు వెన్‌రెడ్డి సంధ్యారాణి, ఉత్సవ కమిటీ సభ్యులు బొబ్బిళ్ల సంధ్య, కామిశెట్టి శ్రీదేవి, గుర్రం విమల, పోలోజు శ్రీలత, డి.కరుణ, ఎస్. రజిత, వి.మంజుల, చింతల కరుణ, ఎం.పద్మావతి, డి.రమాదేవి, కుసుమ, కీర్తన పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించారు. మహిళలు ఒకరికొకరు వాయినాలను ఇచ్చిపుచ్చుకున్నారు.

మోత్కూరు : మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో పెద్దమ్మతల్లి వరలక్ష్మీ రూపంలో దర్శనమిచ్చింది. రూపాయి నాణేలు (రూపాయి బిళ్లలు) పొదిగిన చీరను పూజారి పారునంది లక్ష్మణమూర్తి శర్మ అమ్మవారికి అలంకరించారు. అనంతరం ఆత్మకూరు(ఎం) గ్రామ పంచాయతీ కారోబార్ కృష్ణ-అండాలు దంపతులు అన్నదానం చేశారు.



మోత్కూరు: పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



వలిగొండ: త్రిశక్తిక్షేత్రంలో కొలువుదీరిన అమ్మవార్లు

వలిగొండ: మండల కేంద్రంలోని హరిహర త్రిశక్తి క్షేత్రంలో మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలను జరిపించారు. మహిళలు వరలక్ష్మీవ్రతాన్ని ఆచరించారు.

రామన్నపేట: మండల కేంద్రంతో పాటు వెల్లంకి గ్రామంలోని శ్రీ శంభు లింగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో పూజలు చేయించి వరలక్ష్మీ వ్రతకథను వినిపించారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని మార్కండేశ్వరస్వామి దేవాలయంలో స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



చౌటుప్పల్: సీతారామచంద్రస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలను నిర్వహిస్తున్న భక్తులు



రామన్నపేటలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులు



పోచంపల్లి: లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులు

ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

మోత్కూరు, ఆగస్టు 16: కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించినట్టుగా ఎలాంటి షరతులు లేకుండా ప్రతీ రైతుకు రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు పోచం సోమయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 47 లక్షల మంది రైతులకు రూ.31వేల కోట్లు రుణమాఫీ చేయాల్సి ఉండగా మాఫీకి రకరకాల కొర్రీలు పెట్టి 22.22 లక్షల మంది రైతులకు రూ.17,870 కోట్లు మాత్రమే మాఫీ చేశారని విమర్శించారు. మిగతా 25 లక్షల రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. నాయకులు ఏనుగు జితేందర్‌రెడ్డి, గుంటి సతీష్ ఆయన వెంట ఉన్నారు.

'శంకరయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి'

వలిగొండ, ఆగస్టు 16: గ్రామపంచాయతీ కార్మికుడు బుంగమట్ల శంకరయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల భిక్షం, జిల్లా మాజీ అధ్యక్షులు ఎడవెల్లి ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అనారోగ్యానికి బుంగమట్ల (నల్లాల) శంకరయ్య మృతి చెందాడు. ఈ సందర్భంలో ఆ సంఘం నాయకులు ఆయన మృతదేహానికి పుష్పగుచ్ఛం వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత 35సంవత్సరాలు గ్రామపంచామయతీ వాటర్‌మెన్‌గా పని చేస్తూ అనారోగ్యానికి గురై మృతి చెందడం బాధకారం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన అంతిమ యాత్ర స్వగ్రామంలో జరిగింది. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, మల్లయ్య, రామలింగం, సాలయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

క్రీడా, యువజన సేవాకార్యక్రమాలు చేపడతాం



నేతాజీ యువజన సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 16: పట్టణంలోని నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో క్రీడా, యువజన, సేవా కార్యక్రమాలను చేపడతామని నూనత అధ్యక్షుడిగా ఎన్నికైన గునిగంటి రమేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని నేతాజీ యువజన సంఘం గౌరవ సభ్యులు కుడికాల బాలనర్సింహ, బోడ సత్యనారాయణ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గునిగంటి రమేష్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా డబ్బికార్ సాయేష్‌కుమార్, వేముల పాండు, కుడికాల రామనర్సింహ, ప్రధాన కార్యదర్శిగా శెట్టి శ్రీనివాస్‌ముదిరాజ్, సహాయ కార్యదర్శులుగా చెర్కు ఆనంద్‌గౌడ్, వంగూరి పాండు, ముప్పిడి శ్రీనివాస్, గునిగంటి వెంకటేష్‌గౌడ్, చెర్కు నవీన్‌గౌడ్, సాంస్కృతిక కార్యదర్శిగా కీర్తి సంజీవ, సహాయ కార్యదర్శులుగా తన్నీరు ధీరజ్, కుడికాల శ్రీనివాస్, పండుగ సోను, క్రీడాకార్యదర్శిగా శెట్టి నాగరాజు, మస్నం ప్రసాద్, కొండ భాస్కర్, కార్యవర్గ సభ్యులుగా కీర్తి శేఖర్, సబ్బుగాని శంకర్, గంగదారి విజయ్, వంగైరి శ్రవన్, శెట్టి మణికంఠ ఎన్నికయ్యారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

ఆత్మకూరు(ఎం) ఆగస్టు 16: వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించాలని, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మూగ జీవాలు విద్యుదాఘాతంతో మృత్యువాత పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు రైతులు కోరారు. విద్యుత్ సరఫరాపై రైతుల అభిప్రాయ సేకరణ కోసం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ శాఖ వారు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఏఈ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని, ప్రమాదాల నివారణ చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ప్యాక్స్ చెర్మన్ జి.శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జె.నగేష్, స్వామి, మల్లారెడ్డి, హన్మంత్, సత్యనారాయణ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భువనగిరి టౌన్, ఆగస్టు 16: మరమ్మతుల కారణంగా శనివారం భువనగిరి పట్టణంలో రెండు దఫాలుగా వేర్వేరు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ సాయి కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో తలెత్తిన మరమ్మతులకు ఉదయం 7.20గంటల పాటు కిసాన్‌నగర్ పరిసరాల్లో, మధ్యాహ్నం రామ్‌నగర్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు కోసం మాంటిస్సోరి హైస్కూల్ లేన్‌లో ఉదయం 9 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు తెలిపారు. మరమ్మతు పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మందకృష్ణమాదికు సన్మానం



కృష్ణమాదిగను సన్మానిస్తున్న నాయకులు

ఆత్మకూరు(ఎం)/చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 16: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణను శుక్రవారం ఆత్మకూరు(ఎం), చౌటుప్పల్ మండలాల నాయకులు హైదరాబాద్‌లో ఆయన స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి, నల్ల బాల్‌రాజు, డి.రామక్రిష్ణ, శంకర్, దేవేందర్, లింగస్వామి, శ్రీను, బాల్‌నర్సింహ, బోయ లింగస్వామి, సంపత్, వంశీ, అరవింద్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మోత్కూరు : మండలంలోని పాటిమట్ల గ్రామానికి చెందిన దొండ మల్లమ్మ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొందింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమెకు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ.33 వేల సీఎం సహాయనిధి చెక్కును శుక్రవారం బీజేపీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య లబ్ధిదారుకు అందజేశారు.

● మోత్కూరు మండలంలోని పాలడుగు గ్రామానికి చెందిన శివరాత్రి సత్తయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఎమ్మెల్యే మందుల సామేల్ సహకారంతో మంజూరైన రూ.60 వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మోత్కూరు సింగిల్ విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు లబ్ధిదారునికి అందజేశారు.

వలిగొండ: స్నేహ ఆటో యూనియన్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు గొలుసుల పెంటయ్య హామీ ఇచ్చారు. మండల కేంద్రంలో ఆటో యూనియన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా గొలుసుల పెంటయ్య, గౌరవ అధ్యక్షులుగా ఎగ్గ మల్లేశం, బండారి కృష్ణ, బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా నందూరి నర్సింహ ఎన్నికయ్యారు.

వలిగొండ: జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీగా ఎంపిక కావడంపై తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి క్రిస్టఫర్ హర్షం వ్యక్తం చేశారు. విలేకరులతో మాట్లాడుతూ, ఎమ్మెల్సీగా కోదండరాంకు కాంగ్రెస్ ప్రభుత్వం అవకాశం ఇవ్వడం సంతోషదాయకమని అన్నారు.

చౌటుప్పల్ టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల్లోని అధికారులు, ఉద్యోగులకు ప్రజాపతి బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విద్యాలయం ఆధ్వర్యంలో ప్రతినిధులు రాఖీలు కట్టారు. మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, తహసీల్దార్ హరికృష్ణ తదితరులకు రాఖీ లు కట్టారు.

భువనగిరి టౌన్: హైదరాబాద్‌లో ఈ నెల 27నజరగనున్న రాష్ట్ర రేషన్ డీలర్ల సమావేశానికి హాజరు కావాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని రేషన్ డీలర్లు కోరారు. ఈమేరకు మంత్రిని హైదరాబాద్‌లో కలిశారు.

బునాదిగాని కాల్వ నిర్మాణం పూర్తిచేయాలి



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మల్లేషం

మోత్కూరు, ఆగస్టు 16: బునాదిగాని కాల్వ నిర్మాణం పూర్తి చేసి, కాల్వను బస్వాపూర్ రిజర్వాయర్‌కు అనుసంధానం చేసి, ఈ ప్రాంత రైతులకు గోదావరి జలాలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కల్లూరి మల్లేషం డిమాండ్ చేశారు. శుక్రవారం మోత్కూరులో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీబీనగర్ మండలం మక్తఅనంతారం నుంచి ప్రారంభమైన ఈ కాల్వ భువనగిరి, ఆత్మకూరు(ఎం), మోత్కూరు మండలాల మీదుగా అడ్డగూడూరు మండలం ధర్మారం వరకు 98 కిలోమీటర్లు వెళుతుందన్నారు. ఇప్పటికి 54 కిలోమీటర్లు మాత్రమే పూర్తయ్యిందని, ఇంకా 44 కిలోమీటర్లు పూర్తి కావాల్సి ఉందన్నారు. కాల్వ కోసం ఇంకా 106 ఎకరాల భూమి సేకరించాల్సి ఉందన్నారు. ఏళ్లు గడిచినా కాల్వ నిర్మాణం పూర్తికాక ఈ ప్రాంత రైతులు సాగు నీటికోసం అల్లాడిపోతున్నారన్నారు. కాల్వ నిర్మాణం పూర్తి చేయాలన్న డిమాండ్‌తో త్వరలోనే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. రాజకీయాలకు అతీతంగా కాల్వ నిర్మాణం కోసం నిర్వహించే పోరాటంలో కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి, కాంగ్రెస్ నాయకుడు అవిశెట్టి అవిలిమల్లు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్, నాయకులు పైళ్ల యాదిరెడ్డి, కూరపాటి రాములు, దడిపెల్లి ప్రభాకర్, మెతుకు అంజయ్య, పిట్టల చంద్రయ్య, పైళ్ల రాంరెడ్డి, కొంపెల్లి గంగయ్య, కందుకూరి నర్సింహ పాల్గొన్నారు.

ఊపిరి ఉన్నంత వరకు ప్రజాసేవలోనే..



యాదగిరిగుట్టలో కేక్ కట్‌చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీత

యాదగిరిగుట్ట రూరల్/ ఆలేరు రూరల్/ మోటకొండూరు/ గుండాల/ రాజాపేట, ఆగస్టు 16: ఊపిరి ఉన్నంత వరకు ఆలేరు ప్రజలకు సేవలందిస్తానని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె జన్మదినం వేడుకల్లో భాగంగా స్థానిక సింహద్వారం వద్ద బర్త్ డే కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలేరు ప్రజలు నాపై చూపిస్తున్న ఆదరణ మర్చిపోలేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 8నెలలు అయినప్పటికి ప్రజల ఆదరణ కోల్పోయిందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని కోరారు. అనంతరం బాహుపేట గ్రామంలోని ఫంక్షన్ హాల్‌లో నాయకులు పూలమాలలు, శాలువాలతో ఆమెను సన్మానించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, యాదగిరిగుట్ట పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మిడి రాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కర్రె వెంకటయ్య, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, నాయకులు కొండల్ రెడ్డి, నరహరి ఉన్నారు.

● ఆలేరు మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు గొంగిడి మహేందర్‌రెడ్డి, సూదగాని హరిశంకర్‌గౌడ్, పుట్ట మల్లేశ్, నాగరాజు, కృష్ణమరాజు, రమేష్ ఉన్నారు.

● మోటకొండూరులో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొట్ల యాదయ్య, ఎగ్గిడి కృష్ణ, సిరబోయిన నర్సింగ్ యాదవ్, ఎండి బురాన్, బొట్ల నర్సింహ పాల్గొన్నారు.

● గుండాల మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు ఎండీ.ఖలీల్, గడ్డమీది పాండరి, శ్రీనివాస్, మహేశ్, రాములు, శ్రీను, దయాకర్, సాయి ఉన్నారు.

● రాజాపేటలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు తిరుమల్లేష్, మధుసూదన్‌రెడ్డి, ప్రవీణ్, హరినాథ్, భాగ్యమ్మ, అంబబాయి, వీరేశం, ఖరీమ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వాజపేయి జీవితం స్ఫూర్తిదాయకం



భువనగిరిలో వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

భువనగిరి టౌన్/ భువనగిరి రూరల్, ఆగస్టు 16: మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి జీవితం స్ఫూర్తిదాయకమని పలువురు బీజేపీ నాయకులు అన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం భువనగిరిలో బీజేపీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రత్నపురం బలరాం, రాళ్లబండి కృష్ణమాచారి రత్నపురం శ్రీశైలం, వల్లంశెట్టి నగేష్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి బట్టు క్రాంతి, నాయకులు ఎంగిలి లక్ష్మణ్ ఎదగాని సంతోషష్, హీరేకార్ కృష్ణ, పరమేష్, కోళ్ల సుధాకర్, రమేష్, ఉషాకిరణ్, శ్రీధర్, జహంగీర్ పాల్గొన్నారు. భువనగిరి మండలం బండసోమారంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చీర్క సురేష్‌రెడ్డి, నాయకులు మాణిక్యంరెడ్డి, వినోద్, మాటూరి అనిల్, క్యాసాని శ్రీనివాస్, వెంకటేశ్, మట్ట ఆంజనేయులు, ఉపేందర్, మహేశ్, భాస్కర్, శంకర్, నల్లమాస రాజు పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నంద గంగేష్, నాయకులు కళ్లెం రాజు, ఐలి సందీప్, హనుమంతు, శ్రీనివాస్, మహేష్, రాములు, స్వామి, వెంకటేష్, భాస్కర్, మహేష్ ఉన్నారు.

మోటకొండూరు : మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు తిరుమల్‌రెడ్డి, చిర్ర రవీందర్, మండల ప్రధాన కార్యదర్శి ఆలేటి నాగారాజు, మండల ఉపాధ్యక్షుడు మాల్గ అశోక్, బాల్ద నర్సింహులు, భూమండ్ల సతీష్, ప్రదీప్, సాయి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

రామన్నపేట, ఆగస్టు 16: యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని ఏఎస్ఐ సురేందర్ తెలిపారు. రామన్నపేట మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులు, విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలను సేవించి వాటికి బానిసలై భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. యువ శక్తి ముందు ఏది సాటిరాదని యువత తలచుకుంటే ఉన్నత స్థానాల్లో ఉంటారన్నారు. అశాశ్వత అనందాలకు అలవాటు పడి కన్న తల్లదండ్రులకు శోకం మిగల్చవద్దని సూచించారు. మత్తు పదార్థాల పట్ల, సైబర్ నేరాల నివారణపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్ష కార్యదర్శులు పల్లపు దుర్గయ్య, రావుల నరేష్, పోలీసులు కానిస్టేబుళ్లు శ్రీకాంత్, అశ్విని, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శిగా లక్ష్మి



భువనగిరి టౌన్, ఆగస్టు 16: మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా భువనగిరి పట్టణానికి చెందిన బానోతు లక్ష్మీ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ శుక్రవారం నియామకపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తవ వంతు కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

కేటీఆర్ మహిళలకు క్షమాపణ చెప్పాలి



రాజాపేటలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

రాజాపేట/ మోటకొండూరు, ఆగస్టు 16: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మహిళలకు బహిరంగా క్షమాపణ చెప్పాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు.మహిళలను కేటీఆర్ అవమాన పరిచారని శుక్రవారం రాజాపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. గాంధీ చౌరస్తా వద్ద కేటీఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్ గౌడ్, రేణుక, పెంటయ్య గౌడ్, మోత్కుపల్లి ప్రవీణ్, లక్ష్మణ్, నర్సింహరెడ్డి, బాబు, బస్వవయ్య, బక్కయ్య పాల్గొన్నారు. మోటకొండూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేటీఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమండ్ల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బాల్ద రామకృష్ణ, పాండురంగయ్య, సిద్ధులు పాల్గొన్నారు.

లింక్‌రోడ్డు మూలమలుపులో జర పైలం

● నిలిచిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 16: చౌటుప్పల్ పట్టణంలోని మార్కండేయ స్వామి దేవాలయం వద్ద లింక్ రోడ్డు మూల మలుపు ప్రమాదకరంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మునిసిపాలిటీలోని కాలనీలలో సీసీ రోడ్లను విస్తారంగా నిర్మించారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ దిగిపోయి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీసీ రోడ్ల నిర్మాణాలను ఎక్కడికక్కడే నిలిపివేశారు. ఈ క్రమంలో మార్కండేయ స్వామి దేవాలయం పక్కన మూల మలుపు వద్ద సుమారు 100 మీటర్ల రోడ్డు నిర్మాణాన్ని అర్థాంతరంగా నిలిపివేయడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా తయారైంది. ఈ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం తీసిన కందకం ప్రమాదకరంగా మారింది. వాహనాల రాకపోకలకు అంతరాయంగా మారడంతో మారో మార్గంలో వెళ్లవలసిన పరిస్థితి. ఎనిమిది మాసాలుగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్డును నిలిపి వేసిన ఈ మూల మలుపు వద్ద నుంచి నాలుగు వైపుల వాహనాలు తిరుగుతుంటాయి. ప్రధానంగా ఈ లింక్ రోడ్డు నుంచి లింక్ రోడ్డు నుంచి లింగారెడ్డి గూడెం, తాళ్లసింగారం, లింగోజీ గూడెం, ఎస్.లింగోటం తదితర గ్రామాలకు వాహనాలు వెళుతుంటాయి. ఎంతో రద్దీగా ఉండే ఈ లింక్ రోడ్డు మూల మలుపు వద్ద సీసీ రోడ్డు నిర్మించక పోవడంతో అనేక వాహనాలు ప్రమాదాలకు గురయ్యాయి. ద్విచక్ర వాహనదారులు గాయాలకు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి. 10, 11 వ వార్డులకు చెందిన రెండు, మూడు కాలనీలకు చెందిన వాహనదారులు, ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



కందకం తవ్వడంతో ప్రమాదకరంగా మారిన సీసీ రోడ్డు అంచు భాగం



మార్కండేశ్వరస్వామి ఆలయం వద్ద సీసీకి నోచుకోని మూలమలుపు లింకురోడ్డు

వారం రోజుల్లో సీసీ రోడ్డు వేయిస్తా..



మార్కండేయ స్వామి దేవాలయం సమీపంలో మూల మలుపు వద్ద 100 మీటర్ల సీసీ రోడ్డును వారం రోజుల్లో వేయిస్తా. సీసీ రోడ్డును నిర్మించే ప్రాంతాన్ని మూడు రోజుల క్రితం హెచ్‌ఎండీఏ అధికారులు పరిశీలించారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు సీసీ రోడ్డు నిర్మాణానికి జరిగే వ్యయాన్ని అంచనా వేశారు.

-బొడిగే అరుణా భాలకృష్ణ, 10 వ వార్డు కౌన్సిలర్, చౌటుప్పల్ మునిసిపాలిటీ